క్లుప్తంగా

## దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**రామడుగు:** మండలంలోని గ్రామాల్లో మురుగునీటి నిల్వలతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, నివారణకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, భాస్కరాచారి, శ్రీనివాసాచారి, శేఖర్, లక్ష్మణ్, రాజమల్లయ్య, లక్ష్మీకాంతారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## చిగురుమామిడి ఆటోయూనియన్ కార్యవర్గం



నూతన కార్యవర్గం నాయకులు

**చిగురుమామిడి:** చిగురుమామిడి మండల ఆటోయూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని హమాలీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 17 గ్రామాల ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా పొన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కయ్యం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా తోట లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా నాంపల్లి సురేశ్, కోశాధికారిగా ఈగ వెంకటేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొన్నం శేఖర్‌ను ఎన్నుకున్నామని అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన పొన్నం శ్రీనివాస్ తెలిపారు. ఆటో కార్మిక సంక్షేమ సంఘం జేఏసీ అధ్యక్షుడు మద్దెల రాజేందర్ సమక్షంలో మండల కమిటీ ఎన్నికైందన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి సంపత్, పలువురు పాల్గొన్నారని శ్రీనివాస్ తెలిపారు.

## వ్యర్థాలతో చెరువు నీరు కలుషితం

**శంకరపట్నం:** చికెన్, మాంసం, చేపల వ్యర్థాలు కేశవపట్నం వాగులో వేస్తుండటంతో ముత్తారం రామసముద్రం చెరువునీరు కలుషితమవుతుందని డీఆర్వోకు అంబేద్కర్ గ్రామశాఖ అధ్యక్షుడు కనకం సాగర్ మంగళవారం ఫిర్యాదు చేశారు. వాగు, చెరువులోని నీటిని తాగుతున్న పశువులు రోగాలబారిన పడుతున్నాయని, వాగులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై సురేందర్

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా ఎస్సై మామిడాల సురేందర్ మంగళవారం విద్యార్థులను అభినందించారు. కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన పోటీలలో కటాఫ్ విభాగంలో 9 గోల్డ్, 3 సిల్వర్, ఆరు బ్రాంజ్ మెడల్స్‌తో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, కరాటే మాస్టార్ రాజు తెలిపారు.

## గణేశ్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

**చిగురుమామిడి:** గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై బి. రాజేశ్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారాలను అందించాలన్నారు. అనుమతి పత్రాలు దాఖలు చేసిన వారికి మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రజలకు ఆటంకం కలగకుండా , అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భక్తి గీతాలను మాత్రమే ప్లే చేయాలని, విద్యాలయాలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాల వద్ద స్పీకర్ బాక్స్‌లు వినియోగించాలని సూచించారు.

## వీధిదీపాలు ఏర్పాటు

**శంకరపట్నం:** మండలంలోని అర్కండ్లలో గ్రామస్తులే వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతుండగా సదరు అధికారి పట్టించుకోకపోవడంతో ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన శేర్ల శ్రీనివాస్, కోటి, మోహన్, మధు, జక్కుల శ్రీనివాస్, అరుణ్, నేదురు సంపత్ వీధి దీపాలతో పాటు ఎలక్ట్రిక్ సామగ్రి బిగించడంతో వీధి దీపాలు వెలిగాయి. మంగళవారం ఓ రైతు బైక్‌పై అర్కండ్ల లోలెవెల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. పక్కనున్న రైతులు అతడిని కాపాడి బ్రిడ్జి దాటించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

### హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ





అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, తదితరులు

**హుజూరాబాద్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి జీవితాలను కాపాడుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో మాట్లాడారు. బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలని, 18 ఏళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపితే కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై షేక్ యూనిస్, మహమ్మద్ అలీ, పోలీసులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**జమ్మికుంట:** యువత చెడు అలవాట్లకు దురంగా ఉండాలని, బర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీనివాస్‌జీ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో గాయత్రి, చాణక్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలు, సైబర్‌నేరాలు, ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని, కుటుంబ సభ్యులకు సైబర్ మోసాలను వివరించాలన్నారు. అనంతరం యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్ నిరోధక పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ టి.వివేక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేశ్‌బాబు, చాణిక్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దబ్బెట రవీందర్, పోలీసులు విద్యార్థులు పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

**హుజూరాబాద్:** మత్తుపదార్థాలతో యువత తప్పుదోవ పడుతుందని యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. సే నో టూ డ్రగ్స్‌ పేరిట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను హుజూరాబాద్ పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్ ఆవిష్కరించారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి తల్లిదండ్రులు కాయకష్టం చేసి పిల్లలు చదివిస్తుంటే కొంతమంది మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ తీసుకొని నేరాలకు పాల్పడుతూ ఉన్నత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ నిర్మూలనకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సందమల్ల నరేశ్, టేకుల శ్రావణ్, బి.ఆర్ గౌడ్, జంగ అనిల్ కుమార్, లంక దాసరి గంగరాజు, చల్లూరి విష్ణువర్ధన్, ముక్క రవితేజ, కొండ్ర నాగరాజు, రాజేశ్, బీట్ల సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ తిరుమల్, తదితరులు

## పాత పింఛన్ విధానం అమలు చేయాలి



జగదీశ్వర్‌కు వినతిపత్రమిస్తున్న కృష్ణకుమార్, భాస్కర్

**గన్నేరువరం:** పాత పింఛన్ విధానం అమలుకు కృషి చేయాలని కోరుతూ ఎంప్లాయిస్ టీచర్స్ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌ను హైదరాబాద్‌లోని టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ భవన్‌లో టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. యూపీఎస్ ఉద్యోగులకు లాభదాయకంగా లేదని, ఒక్క రూపాయి కూడా చందా వేయకుండా 1980 రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జేఏసీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని కోరారు. అనంతరం సీపీఎస్ రద్దు కోసం జేఏసీ పక్షాన ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం.సత్యనారాయణగౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

**జమ్మికుంట:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంలో అనేక లోపాలు ఉన్నాయని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు మర్రి అవినాశ్ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సీపీఎస్‌రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేయకుండా అశాస్త్రీయంగా ఉన్న యూనిఫైడ్ పెన్షన్ విధానం తీసుకువచ్చిందని విమర్శించారు. ఉద్యోగ, టీచర్లు, పెన్షనర్ల పక్షాన పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు.

## 'వాగేశ్వరి' ప్రొఫెసర్‌కు డాక్టరేట్



శ్రీధర్‌రెడ్డి

**తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కంకణాల శ్రీధర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. 'డిజైన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ క్వశ్చన్ అండ్ ఆన్సరింగ్ సిస్టం యూజింగ్ డీప్ లర్నింగ్ టెక్నిక్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గ్లోకల్ యూనివర్సిటీ, ఉత్తరప్రదేశ్ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్లోబల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అమిత్‌సింగ్ పర్యవేక్షణలో పరిశోధన చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డిని కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. చంద్రమౌళి వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## రుణమాఫీపై ఏడీఏను నిలదీసిన రైతులు



రైతువేదికలో ఏడీఏ సుధాకర్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

**చిగురుమామిడి:** రుణమాఫీ ఎప్పుడు వర్తిస్తుందని ఆయా గ్రామాల రైతులు మానకొండూర్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ ఎస్. సుధాకర్ ను నిలదీశారు. చిగురుమామిడి రైతువేదికలో రుణమాఫీ కాని రైతులనుంచి వారం రోజులుగా స్వీకరించిన దరఖాస్తులను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఏడీఏపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా మాఫీవర్తిస్తుందని, ఎవరూ ఆందోళన పడొద్దన్నారు. రెండు లక్షలకుపైగా రుణాలు ఉన్న వాటిపై ప్రభుత్వం నుంచి విధివిధానాలు రానున్నాయని తెలిపారు. సమావేశంలో ఏఈఓలు సాయికుమార్, ఫిరిదుద్దీన్, అఖిల, అంజలి, సతీష్, ప్రణయ్ పాల్గొన్నారు.

## ఏడీఏను కలిసిన డీలర్లు



ఏడీఏ శ్రీధర్‌ను సన్మానిస్తున్న డీలర్లు

**తిమ్మాపూర్:** మానకొండూరు ఏడీఏగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను తిమ్మాపూర్ రైతు వేదికలో గన్నేరువరం ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ.. ఫెర్టిలైజర్ డీలర్స్ సీజన్‌లో రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని నాణ్యమైన ఎరువులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిరణ్మయి, అసోసియేషన్ అధ్యక్షుడు అటికం తిరుపతి, సభ్యులు రాములు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



హుజూరాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**హుజూరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలోని కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యలు తీరుస్తామని ఎన్నికల ముందు చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క సమస్య కూడా నెరవేర్చలేదన్నారు. కార్మికులంతా దశల వారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. కార్మికులు టీఎస్ సింగ్, సాధుల కిషోర్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

- **ఉద్యాన పంటల సాగుకు సబ్సిడీ**

**చిగురుమామిడి:** ఉద్యాన పంటల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని అందిస్తున్నామని చిగురుమామిడి మండల ఉద్యానశాఖ అధికారి బి. మంజువాణి తెలిపారు. మండలంలోని సుందరగిరి గ్రామంలో మంగళవారం ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణంలో భాగంగా కంది మహేందర్‌రెడ్డి వ్యవసాయక్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు.

- **సహకార సంఘం భవనం ప్రారంభం**

**గంగాధర:** మండల కేంద్రంలో నిర్మించిన గంగాధర వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ప్రారంభించారు. న్యాలకొండన్నపల్లి శివారులో ఆరెకరాల స్థలం కేటాయించి రైసు మిల్లు ఏర్పాటుకు సహకరించాలని సహకార సంఘం అధ్యక్షుడు దూలం బాలగౌడ్ కోరారు.

- **డెయిరీ, వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ**

**మానకొండూర్‌రూరల్:** మండల కేంద్రంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో డైయిరీ ఫార్మింగ్, వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రాంభించారు. ముఖ్య అతిథిగా డీఆర్డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్ హాజరయ్యారు.

- **కుంట శిఖం కాపాడాలి**

**చొప్పదండి:** పట్టణంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమిని కబ్జా నుంచి కాపాడాలని, శిఖం భూ మికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మంగళవారం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

- **కల్వల ప్రాజెక్టు మరమ్మతు కాంగ్రెస్‌దే**

**హుజూరాబాద్:** కల్వల ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు.

- **'హైడ్రా' వ్యవస్థను విస్తరించాలి**

**గన్నేరువరం:** హైడ్రాను రాష్ట్రంలోని అన్నిప్రాంతాలకు విస్తరింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రంలో మంగళవారం మాట్లాడారు. మండలకేంద్రంలో మంగళవారం మాట్లాడారు. వివిధ గ్రామాల్లోని చెరువుల శిఖం, ఎస్సారెస్పీ ఆక్రమిత భూములకు రక్షణ లేకుండా పోయిందని, వాటి రక్షణకు హైడ్రా తరహా వ్యవస్థను తీసుకురావాలని కోరారు. గుండ్లపల్లి చెరువులో అక్రమంగా నిర్మించిన పాలకేంద్రాన్ని కూల్చివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు ఎస్సారెస్పీ భూములను ఆక్రమించుకున్నారని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు.

- **విజయవంతం చేయాలి**

**రామడుగు:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వక్షతన సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

**శంకరపట్నం:** బీజేపీ సభ్యత్వ నమోదులో శంకరపట్నం మండలం ముందుండాలని జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం మండల అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

- **దంపింగ్ యార్డు తొలగించాలి**

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధి సర్వే నంబర్ 275, 277, 278లలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2006లో కేటాయించిన స్థలాల లబ్ధిదారులు మంగళవారం తహసీల్దార్ రమేశ్‌ను కలిశారు. మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును తొలిగించాలని కోరారు.

- **రుగ్మతలను రూపుమాపాలి**

**హుజూరాబాద్‌రూరల్:** సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమాజంలో జరుగుతున్న పలు విషయాలపై చర్చించారు.

- **భవన నిర్మాణానికి భూమిపూజ**

**గంగాధర:** మండల కేంద్రంలో నిర్మించనున్న గంగాధర ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు.

- **ఓపెన్ జిమ్ ఏర్పాటుకు..**

**చిగురుమామిడి:** మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఓపెన్ జిమ్ కోసం మండల పంచాయతీ అధికారి బండ రాజశేఖర్ భూమిపూజ చేశారు. గ్రామస్తులతో కలిసి మంగళవారం పనులు ప్రారంభించారు.

- **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

**చిగురుమామిడి:** మండల కేంద్రంలో సీసీరోడ్డు పనులకు మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ శంకుస్థాపన చేశారు. మంగళవారం కేడీసీసీ బ్యాంకు వీధిలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసిందని రవీందర్ తెలిపారు.

- **బీఆర్ఎస్ నాయకుల సంబరాలు**

**హుజూరాబాద్:** ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు.

**గంగాధర:** రాజకీయ కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని, న్యాయ పోరాటంలో చాలా రోజులకు న్యాయమే గెలిచిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు.

- **ఎంపీ పరామర్శ**

**హుజూరాబాద్‌రూరల్:** పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సానుభూతి, సంతాపం తెలిపారు.

# అంబేడ్కర్‌నగర్ జీపీ వద్దంటూ రాస్తారోకో

- రోడెక్కిన దళితకాలనీవాసులు
- ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని ఆరోపణ
- గద్దపాకలోనే కొనసాగించాలని వినతి



రాస్తారోకో చేస్తున్న దళిత కాలనీవాసులు

**శంకరపట్నం:** మండలంలోని గద్దపాక దళితకాలనీ వాసులు ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయొద్దంటూ రోడ్డెక్కారు. కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. గద్దపాక గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి అదే గ్రామ పంచాయతీలో కొనసాగుతున్నామని కాలనీవాసులు వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్షంగా అంబేడ్కర్‌నగర్ పేరిట గద్దపాక జీపీ నుంచి వేరు చేసి కేవలం ఎస్సీ కాలనీ(మాదిగసామాజిక)గా ప్రత్యేక గ్రామపంచాయతీ చేయడం ఏంటనీ, అంటరానివారిగా ప్రత్యేక జీపీ చేశారని ఆరోపించారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా సమాచారం అందుకున్న ఎస్సై రవి సిబ్బందితో తరలివచ్చి ఆందోళనకారులకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపచేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని గోడువెళ్లబోసుకున్నారు. అంబేడ్కర్‌నగర్ పేరిట గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తే సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయమని, ఎవరైనా పోటీ చేసినా ఓట్లు వేయమన్నారు. ఇతర సామాజిక వర్గాలు లేకుండా జీపీ ఏర్పాటు చే యడమంటే దళితులను చిన్నచూపు చూడటమేనని, గద్దపాక జీపీలోనే కొనసాగించాలని ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

## స్థలాల పరిశీలన

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుదారుల స్థలాలను మున్సిపల్ టీపీవో శ్రీధర్, ఆర్‌ఐ శంకరయ్య, ఇరిగేషన్ ఏఈ నవీన్ మంగళవారం పరిశీలించారు. స్థల యాజమానులకు సమాచారం అందించి క్షేత్రస్థాయిలో ప్రక్రియ పూర్తి చేశారు. టీపీవో శ్రీధర్ మాట్లాడుతూ.. 2020లో ఎల్ ఆర్ ఎస్ కింద జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 5,904 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1090 దరఖాస్తులను పరిశీలించగా 119 అర్హులైన స్థల యాజమానులు రూ.39లక్షలు చెల్లించగా మున్సిపల్‌కు ఆదాయంగా సమకూరిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఎల్-1లో టీపీవో, ఆర్‌ఐ, ఇరిగేషన్ ఏఈ కలిసి అప్‌లోడ్ చేస్తామని, ఎల్-2లో టీపీవో అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. అప్‌లోడ్ చేసిన లాగిన్‌లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ఎల్-3 అప్‌లోడ్ చేసి క్రమబద్ధీకరణ పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్ఆర్ఎస్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజిగిరిషరీఫ్‌లో వైద్య శిబిరం





వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తిక్

**జమ్మికుంట:** మండలంలోని వావిలాల పీహెచ్‌సీ పరిధిలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో డాక్టర్ కార్తిక్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 66 మందికి వైద్య పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. ఆరుగురు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అనంతరం డ్రై డే, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ సదానందం, ఏఎన్ఎంలు తిరుమల, శ్రీముఖి, ఆశా పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి

**హుజూరాబాద్:** పట్టణంలోని కృష్ణాలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీధరాచార్యులు శ్రీకృష్ణ జన్మ వృత్తాంతాన్ని, కృష్ణతత్వాన్ని భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ కార్యవర్గం, భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధి వెంకటాద్రినగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేదపండితులు శ్రీకృష్ణమాచార్యులు, వేణుగోపాల చార్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలు, తీర్థ ప్రసాదం వితరణ చేశారు. దేవాలయం కమిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు కిషన్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న నాలుగు బృందాలకు టౌన్ సీఐ రవి రూ.12వేల ప్రోత్సాహం అందజేశారు. యాదవ సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## యోగా పోటీలకు గురుకులం విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

**మానకొండూర్‌రూరల్:** రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని దేవంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ (ప్రతిభాకేంద్రం) విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ యాదగిరి తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్‌లో జరిగే పోటీలకు హాజరవుతారని, విద్యార్థుల ఎంపిక పట్ల అధ్యాపకులు జగన్నాథం, రజియాబేగం, శివ, శేఖర్, హర్షం వ్యక్తం చేశారు.

## రైల్వే సమాచారం

### జమ్మికుంట నుంచి ప్రతిరోజు నడిచే రైళ్ల సమాచారం

| | | |
|---|---|---|
| **జమ్మికుంట నుంచి కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు..** | | |
| 12761: | తిరుపతి-కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(గురు, ఆదివారాలు) | 05.26 గంటలకు |
| 17003: | రామగిరి ఎక్స్‌ప్రెస్-కాజీపేట్-సిర్పూర్ టౌన్ | 06.05 గంటలకు |
| 17011: | ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్ | 07.55 గంటలకు |
| 17033: | సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్-భద్రాచలం రోడ్ టూ బల్లార్షా | 10.01 గంటలకు |
| 12757: | కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్ | 10.43 గంటలకు |
| 12721: | దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ హజరాయ్ నిజాముద్దీన్ | (రాత్రి)1.44 గంటలకు |
| 12771: | రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్ | (రాత్రి)1.04 గంటలకు |
| 12791: | ధానాపూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ ధానాపూర్ | 11.34 గంటలకు |
| 16093: | లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ, శని)-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్ | 18.08 గంటలకు |
| 16031: | అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, బుధ, గురువారాలు)- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో | 18.08 గంటలకు |
| 17233: | భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్ | 18.25 గంటలకు |
| 17035: | కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్-కాజీపేట్ టూ బల్లార్షా | 23.18 గంటలకు |
| 12592: | యశ్వంత్‌పూర్ టూ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(మంగళవారం) | 08.55 గంటలకు |
| **జమ్మికుంట నుంచి కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు..** | | |
| 12772: | రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్ | 04.11 గంటలకు |
| 17234: | భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్ | 05.44 గంటలకు |
| 17036: | బల్లార్షా కాజీపేట్ ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్ | 07.20 గంటలకు |
| 17012: | ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్ | 13.55 గంటలకు |
| 17034: | సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్ | 14.45 గంటలకు |
| 16032: | అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, సోమ, గురు)- శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ | 15.34 గంటలకు |
| 16094: | లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)- లక్నో జంక్షన్ టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ | 16.09 గంటలకు |
| 12758: | కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్ | 16.30 గంటలకు |
| 12792: | సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-దానాపూర్ టూ సికింద్రాబాద్ 1 | 7.42 గంటలకు |
| 12722: | దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-నిజాముద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్ | 23.19 గంటలకు |
| 17004: | రామగిరి ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్ | 19.09 గంటలకు |
| 12762: | కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు, ఆది) కరీంనగర్ టూ తిరుపతి | 20.24 గంటలకు |
| 12591: | గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(ఆదివారం) | 10.09 గంటలకు |